ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

- అదనపు ఎస్పీ రామేశ్వర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రామేశ్వర్

కల్వకుర్తి, ఆగస్టు 23 : మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని అదనపు ఎస్పీ రామేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల నెలసరి సమస్యల గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మానవతా ఫర్ మెనిస్ట్రేషన్ ప్రాజెక్టును అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవతా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మహిళలకు అతి ముఖ్యమైన అంశంపైన పనిచేసేందుకు ముందుకొచ్చిన డాక్టర్ రమ్యను ప్రశంసించారు. ఉమెన్ సేఫ్టీ నోడల్ ఇన్‌చార్జి విజయలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల భద్రత గురించి అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన రెవెన్యూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ సంతోష్
- మేధావులు, న్యాయవాదులతో సలహాల సేకరణ

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 : రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేలా ఆర్‌వోఆర్ చట్టంపై నిపుణులు, మేధావులు అందించిన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు సూచనల ఏమైనా ఉంటే వెంటనే రాతపూర్వకంగా కలెక్టరేట్ కార్యాలయానికి అందిస్తే, వాటిని ఒక నివేదిక రూపంలో సీల్ చేసి తుది చట్ట రూపకల్పన కోసం ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, మేధావులు, నిపుణులతో నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదాపై వర్క్‌షాప్ నిర్వహించారు. నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదా బిల్లులో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు తీసుకురావడంలోని ఉద్దేశాన్ని అదనపు కలెక్టర్ సీతారామారావు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం రాబోతున్నది. ఇది వ్యవసాయ భూముల కోసమే కాదు. నివాస స్థలాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేది. ఇందులో ఆబాదికి కూడా భూధార్ నెంబర్ ఇచ్చే ప్రత్యేకాంశాలు ఉన్నాయి. అందుకే ఈ చట్టాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. భూరికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండేవిధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తమ సూచనలను అందజేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న పలువురు మేధావులు, రెవెన్యూ రిటైర్డ్ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, పాత్రికేయులు నూతన రెవెన్యూ చట్టంలో సవరణలు, సలహాలు, సూచనలు చేశారు. గ్రామంలోని ఆబాది భూముల రికార్డులు అప్‌డేట్ చేయాలని, సాదాబైనామాలకు కాలపరిమితి పెట్టి గతంలో వచ్చిన సాదా బైనామా దరఖాస్తులను పూర్తి చేసి సాదా బైనామా ద్వారా పట్టా మార్పిడి రద్దు చేయాలన్నారు. జమాబంది రుసుం వసూలు చేయాలని, అనుభవదారుడు కాలం ఉండాలని, అన్ని మ్యుటేషన్లు అధికారం తాసీల్దార్‌లకు ఇస్తూ మొదటి అప్పిలేట్ అథారిటీ ఆర్డీవో స్థాయిలో ఉండాలన్నారు. వారసత్వ(విరాసత్)పట్టా మార్పిడి ఉచితంగా చేయాలని, ప్రతి సంవత్సరానికి ఒకసారి పహాణీ, రికార్డును కార్యాలయంలో భద్రపరచాలని తెలిపారు. సమగ్ర భూసర్వే చేపట్టాలని వారు కోరారు. వర్క్‌షాప్‌లో ఆర్డీవోలు, తాసీల్దార్లు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేస్తా..

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, ఆగస్టు 23 : పేద ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ పద్మ పేరిట ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.26,500వేల సీఎం సహాయ నిధి చెక్కును శుక్రవారం బాధితురాలి భర్త శ్రీనునాయక్‌కు గోళి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, కోట శ్రీను, సుభాశ్, సతీశ్, సుమన్‌నాయక్, తారాసింగ్, గణేశ్, భుజంగం, శివ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు

ప్రశంసా పత్రాలతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కల్వకుర్తి, ఆగస్టు 23 : చంద్రయాన్-3 చంద్రుడిపై విజయవంతంగా దక్షిణ ధృవం వైపు లాండింగ్ అయిన జ్ఞాపకాన్ని పురస్కరించుకుని శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకోవాలని భారత ప్రధాని ఇచ్చిన పిలుపులో భాగంగా అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శార్వాని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 2024 విద్యాసంవత్సరం పీజీలో ఎమ్మెస్సీ, భౌతిక శాస్త్ర విభాగంలో 12,61ర్యాంకులతో పాటు 100 లోపు మిగతా విభాగాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, అధ్యాపకులు శ్యాంసుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- చారకొండ ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్
- మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు

చారకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్

చారకొండ, ఆగస్టు 23 : ప్రభుత్వం మహిళా సమాఖ్య ద్వారా అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్, ఏపీఎం బాలచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతువేదికలో మహిళా సమాఖ్య సభ్యులకు డైరీఫాం, పౌల్ట్రీఫాంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శివకుమార్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నర్సింహ, సీసీలు విమల, మాధవి, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, ఆగస్టు 23 : మహిళ శక్తి పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు గేదెలు, ఆవులను కొనుగోలు చేయుటకు శ్రీనిధి రుణాలను బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందించనున్నట్లు మండల స్త్రీనిధి మేనేజర్ లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మహిళా సంఘాల సభ్యులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళ శక్తి పథకం ద్వారా పాడి ఆవులు, గేదెల కొనుగోలుకు స్త్రీ నిధి రుణాలు బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తామన్నారు. పాడి ఆవులు, గేదెలతో పాటు నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న మహిళలకు నాటుకోడి పిల్లలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో విజయ, సీసీలు వెంకట్, బాలచంద్రయ్య, పర్వతాలు, తిరుపతయ్య, మహిళా సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ, ఆగస్టు 23 : కోళ్లు, గేదెలు, ఆవులు పెంపకంపై పాడి రైతులు అవగాహన కలిగిఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్, డీపీఎం శ్రీనివాస్‌లు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మహిళ శక్తి ప్రోగ్రాంలో భాగంగా మదర్‌పౌల్ట్రి పెరటి కోళ్లు, గేదెలు, ఆవుల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు భారతి, ఏపీఎం రాములు, ఎంపీవో లక్ష్మణ్, సీసీలు యాదగిరి, రవి, మేనేజర్ అరుణ్, పాండు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, ఆగస్టు 23 : తిమ్మాజిపేటలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తిగల సభ్యులకు బర్రెలు, ఆవులు, కోడి పిల్లల కొనుగోలు వాటి పెంపకంపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, లావణ్యవాటి కొనుగోలు, పోషణ గురించి వివరించారు. బ్యాంకు మేనేజర్ కుమార్ మహిళా సంఘాలకు లోన్లు, వాటి ద్వారా అభివృద్ధి ఎలా చెందాలనే విషయాలపై వివరించారు. శ్రీనిధి ద్వార రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అచ్చంపేటరూరల్ : మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న స్త్రీ మేనేజర్ లక్ష్మణ్

గౌరవ డాక్టరేట్ పట్టా పొందిన నల్లమల వాసి

పీహెచ్‌డీ పట్టా పొందిన శ్రీశైలంను సత్కరిస్తున్న వేదిక్ కళాశాల యాజమాన్యం

అమ్రాబాద్, ఆగస్టు 23 : పదర మండలంలోని వంకేశ్వరం గ్రామానికి చెందిన బర్పటి శ్రీశైలం శుక్రవారం గౌరవ డాక్టరేట్ పట్టాను పొందారు. శ్రీశైలం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో శ్రీమహర్షి కాలేజ్ ఆఫ్ వేదిక్ ఆస్ట్రాలజిలో నవగ్రహాలు మానవుల పై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయని పరిశోధనలు చేసి ఆస్ట్రాలజిలో పీహెచ్‌డీ పూర్తి చేసి తన ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా వేదిక్ కళాశాల యాజమాన్యం బర్పటి శ్రీశైలానికి గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేసి ఘనంగా సత్కరించారు. ఆయన పట్టా పొందడంతో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు నల్లమల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రారంభమైన వెంకటలక్ష్మమ్మ తల్లి ఉత్సవాలు

అమ్రాబాద్, ఆగస్టు 23 : మండల కేంద్రంలో గౌడన్నల ఆరాధ్య దైవం వెంకటలక్ష్మమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించే ఈ ఉత్సవాలకు వెంకటలక్ష్మమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు రాజారాం, రామకృష్ణ, జగన్, నారయ్య, శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

పెద్దకొత్తపల్లి : విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి, ఆగస్టు 23 : తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి పాడి ఆవు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. బాధితుడు తిమ్మాజిపేట నరేందర్ తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పొలంలో ఆవును చెట్టుకు కట్టేసి ఉండగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు తెగి ఆవుపై పడ్డాయని దీంతో గర్భంతో ఉన్న జర్సీ ఆవు మృతి చెందినట్లు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.లక్ష 20వేల వరకు ఉంటుందని, పేద కుటుంబమైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని నరేందర్ కోరారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రకల్ గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఆవు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. చంద్రకల్‌కు చెందిన అర్జునయ్య చెందిన ఆవు వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం

అంబులెన్స్‌లో పుట్టిన బిడ్డతో సిబ్బంది, కుటుంబసభ్యులు

అమ్రాబాద్, ఆగస్టు 23 : మండల కేంద్రానికి చెందిన ఇశ్రాత్‌బేగం పురిటి నొప్పులతో బాధపడుతూ శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో అమ్రాబాద్ సివిల్ దవాఖానకు రావడం జరిగింది. దవాఖాన సిబ్బంది ఆమెను పరిశీలించి అచ్చంపేట ఏరియా దవాఖానకు తీసుకువెళ్లామని కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది ఫైలట్ బషీర్, ఈఎన్‌టీ నాగేశ్ అక్కడికి చేరుకొని అచ్చంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఆర్‌సీపీ వైద్యులు షర్మిల, సూజనల మేరకు అంబులెన్స్‌లో సాధారణ ప్రసవం చేసినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఇశ్రాత్‌బేగానికి ఆడ బిడ్డ పుట్టిందని తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. అనంతరం బాలింత కుటుంబ సభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి ఫలితాలు

- ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్

వ్యక్తిత్వ వికాసంపై వివరిస్తున్న సైకాలజిస్ట్ శ్రీనివాస్

అమ్రాబాద్, ఆగస్టు 23 : మానసిక ఒత్తిడులను అధిగమిస్తేనే విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో స్పందన సంస్థ వారి సహకారంతో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం(సైకాలజి) తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా విద్యను అభ్యసించేటప్పుడు తమ మనసును ప్రశాంతతో, ఏకాగ్రతతో చదవాలని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు పాఠాలను బోధించే సమయంలో విద్యార్థులు తమ ఏకాగ్రతను పాఠ్యాంశంపై పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల విద్యాధికారి బాలకిషన్, ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపక బృం దం, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాన్ని ఢీకొన్న బైక్

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 23 : కల్వకుర్తి మండలం మార్చాలలోని పాత కాటన్ మిల్లు వద్ద కోడాద-జడ్చర్ల ప్రధాన రహదారిపై శుక్రవారం పోలీస్ వాహనాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాటన్‌మిల్లు సమీపంలో ఎస్సై మాధవరెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీస్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీ కొట్టింది. కేశంపేట మండలం లింగంధన గ్రామానికి చెందిన రాజు కల్వకుర్తి మున్సిపాలిటీ సంజాపూర్‌లోని తమ బంధువుల ఇంటికొచ్చి తిరిగి తన గ్రామానికి బైక్‌పై వెళ్తూ పోలీస్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాజును చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీస్ వాహనంలో ఉన్న ఎస్సై మాధవరెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు.

నేటి నుంచి గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు

వంగూరు, ఆగస్టు 23 : మండల కేంద్రంలో వెలసిన గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు శనివారం ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచే కాకుండ హైదరాబాద్, నల్లగొండ తదితర జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారని వారు పేర్కొన్నారు. ఈనెల 24న వైశ్యుల బోనాలు, 25న పద్మశాలి, గౌడ్స్, బోయ, యాదవ, రెడ్డీల బోనాలు, బండ్లు తిరుగుట, 26న తెలుగు వారి బోనాల ఊరేగింపు, 27న రథోత్సవం, 28న యాదవులచే ఉట్లు కొట్టుట కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

డీసీసీబీ చైర్మన్ ఎంపికపై హర్షం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 23 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపిక కావడంపై కొత్తపేట సింగిల్‌విండో చైర్మన్ రాజాగౌడ్, పెద్దకొత్తపల్లి విండో చైర్మన్ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీబీ బ్యాంకు ద్వారా ఈప్రాంత రైతులకు అత్యధిక రుణాలు అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న అన్ని సింగిల్‌విండో సొసైటీలకు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే రుణాలను రైతులకు అందిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు బ్యాంకులో విష్ణువర్ధన్‌రెడ్డిని పూలమాలతో ఘనంగా సన్మానించారు.

కందనూలులో నిరసన ర్యాలీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో ముస్లిం యువకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబజార్ ముందు నుంచి బిన్ మహెపూజ్ మసీదు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కరపత్రాలను విడుదల చేస్తున్న సభ్యులు

27న సమాలోచన సదస్సు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 : తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న పాలమూరులోని వీవీ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర విద్యా వ్యవస్థపై సమాలోచన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పద్మావతి, రవితేజ, గీతాంజలి జూనియర్ కళాశాల అధ్యాపక బృందంతో సమావేశమై సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్ విద్యావిధానాలపైనే ఆధారపడి ఉం దని, తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంలో మార్పులు చేయాలని, విద్యావేత్తలు, బోధన సిబ్బంది, మేధావులు, సామాజిక కార్యకర్తలు తమ అభిప్రాయాలను పేపర్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యాసదస్సులో వినిపించాలని, అందరి అభిప్రాయాలను క్రోడీకరించి విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వానికి అందజేస్తామన్నా రు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ ఆర్గనైజింగ్ కమిటీ రమేశ్‌గౌడ్, మోహన్‌గౌడ్, ఫి జిక్స్ అరుణ్‌కుమార్, కళాశాలల డైరెక్టర్లు శ్రీనివాస్, మురళీధర్‌రావు, శరత్‌బాబు, అధ్యాపకులు కేశవులు, చక్రవర్తి, యాదయ్య, నర్సింహ, ఉమాకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

అచ్చంపేటరూరల్ : ఐనోల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బిజినేపల్లి, ఆగస్టు 23 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని శుక్రవారం బిజినేపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, సుధీర్, జావేద్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, ఆగస్టు 23 : కాంట్రీ బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని మండలంలోని ఐనోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జీహెచ్ఎం బాలస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి రెండో దఫా ఏర్పాడ్డ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఎనిమిది నెలలు గడిచినా సీపీఎస్‌పై స్పష్టమైన వైఖరి తెలుపలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, రాములు, శంకరయ్య, నాను, బలరాం, తుకారాం, గుణకర్ పాల్గొన్నారు.

భ్రమరాంబ ఆలయంలో కుంకుమార్చనలు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 23 : పట్టణంలోని భ్రమరాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయాధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం సందర్భంగా నేడు భక్తులు అమ్మవారికి గాజులు సమర్పించారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం కుంకుమార్చనలో మహిళలకు డిప్ ద్వారా అమ్మవారి చీర బహూకరించబడుతుందని, డిప్‌లో అమ్మవారి చీర పొందిన భక్తులు తదుపరి శుక్రవారం పులిహోర ప్రసాదానికి బియ్యం అందజేయబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్, మహిళ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

పెంట్లవెల్లి, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కురుమయ్య శుక్రవారం గ్రామ ప్రత్యేకాధికారి దేవేందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి పాఠశాల ప్రాంతం మొత్తం వర్షపు నీటితో చిన్నపాటి చెరువును తలపిస్తుందన్నారు. అంతేకాక గ్రామంలో వివిధ కాలనీల నుంచి వర్షపు నీటితోపాటు, మురుగు నీరు రావడంతో పాఠశాల మొత్తం దుర్వాసనతో నిండి పోతుందని పేర్కొన్నారు. వర్షపు నీరు పాఠశాల ప్రాంతంలోకి రాకుండా మట్టి వేయించి, పారిశుధ్య చర్యలు చేపట్టాని కోరారు. ఆయన వెంట ఎమ్మార్సీ రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **MOHAMMAD ADIL AHMED** S/o **MOHAMMED MAQBOOL AHMED**, R/o H.No.1-1-81/D/4, Mothinagar, Near Mothi Masjid, Mahabubnagar District - 509001, Telangana State, here by declare that I have changed my name from **MOHEMMAD ADIL AHMED** (old name) to **MOHAMMAD ADIL AHMED** S/o **MOHAMMAD MAQBOOL AHMED** (new name).

PLOT FOR SALE

★జడ్చర్ల టౌన్‌లో @ DTCP, RERA అప్రూవ్డ్ వెంచర్‌లో వెంటనే ఇళ్ళు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్, సీసీ రోడ్స్, బ్యాంక్ లోన్‌తో కలవు. 6309977999

NT- 40

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాంచు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

KIDNY STONES

★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A